# ‘దోపిడీ విష సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదాం’

## స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర సదస్సులో వక్తల పిలుపు

**గుంటూరు, 9-3-18:**

అంతర్జాతీయ మహిళా పోరాటదినం మార్చి 8-సందర్భంగా స్త్రీవిముక్తి సంఘటన ‘మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణమౌతున్న దోపిడీ విషసంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదాం’, ‘ఆత్మగౌరవంతో హుందాగా జీవించగలిగే నూతన ప్రజాస్వామిక సంస్కృతికై ఉద్యమిద్దాం’ అనే నినాదాలతో రాష్ట్రవ్యాపితంగా పలుచోట్ల సభలు, సమావేశాలు జరిపింది. దీనిలో భాగంగా గుంటూరు ఎన్‌జిజివో కళ్యాణమండపంలో 9-3-18న రాష్ట్రస్థాయి సదస్సు, పట్టణంలో మహిళల ప్రదర్శన నిర్వహించారు. కాకతీయ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి ఈ సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తూ వ్యవస్థీకృత హింస, సాంస్కృతిక కాలుష్యం, ఆర్థిక సామాజిక దోపిడీ మూలాలతో ముడిపడి వుందన్నారు. ఆధిపత్య వర్గ భావజాలం ఎంత వేగంగా వ్యాప్తి చెందుతోందో విశ్లేషించారు. ఉన్నతమైన మానవీయ విలువలకోసం, ప్రస్తుత దోపిడీ పీడనలతో కూడిన ఆర్థిక నిర్మాణాల్ని మార్చుకోవాలని అన్నారు. ఆర్థిక మూలాలతోపాటు సాంస్కృతిక, సామాజిక నిర్మాణాల్ని మార్చుకునే క్రమంలోనే ఉన్నతమైన సమాజాన్ని ఆవిష్కరించుకోగలుగుతామని ఆమె తన ప్రసంగంలో పేర్కొన్నారు.

‘ప్రజాసాహితి’ ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ వ్యవస్థీకృత దోపిడీవల్ల, యుద్ధాలవల్ల, కరవువల్ల, ప్రకృతి విపత్తులవల్ల మహిళలు ఎక్కువ కష్టాల పాలవుతున్నారన్నారు. ‘గాయాలమయమైన స్త్రీల కొరకు’ అన్న కవిత వినిపించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ దోపిడీ రాజకీయాలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు చైతన్యవంతమై నిర్మించే పోరాటాలలో మహిళా ఉద్యమం భాగం కావాలన్నారు.

ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి రాసిన ‘మహిళల జీవన విధ్వంసం-సామాజిక, ఆర్థిక మూలాలు’ పుస్తకాన్ని కొత్తపల్లి రవిబాబు ఆవిష్కరించగా, ‘ఉపాధ్యాయ’ పత్రిక సంపాదకులు షేక్ జిలానీ ఆ పుస్తకాన్ని పరిచయంచేస్తూ ప్రసంగించారు. స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు చల్లపల్లి విజయ ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, ‘స్త్రీ సంఘటన’ పత్రిక సంపాదకులు అమలేందు, ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నుపాటి మంజుల, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు. తదితరులు ఈ సదస్సులో ప్రసంగించారు.

oooo